# బీసీల గొంతుకై పోరాడుతా..

## చేవెళ్ల గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగరేస్తాం

- లోక్‌సభ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతా
- కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి
- అవకాశవాద బీజేపీ, కాంగ్రెస్‌లకు గుణపాఠం తప్పదు
- 'నమస్తే' ఇంటర్వ్యూలో బీఆర్ఎస్ అభ్యర్థి జ్ఞానేశ్వర్

నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూ

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ) : 'లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ మంది బీసీలకు టికెట్ ఇచ్చింది ఒక్క బీఆర్ఎస్ మాత్రమే. ప్రజలు మమ్మల్ని గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే బీసీల సమస్యలపై పోరాడేందుకు అవకాశం దక్కుతుంది.' అంటున్నారు బీఆర్ఎస్ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్. 'నమస్తే తెలంగాణ'కు ఆదివారం ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చిన ఆయన, బీసీ బిడ్డగా 45ఏండ్లపాటు పోరాటం చేశానని, 96 కులాలను ఏకం చేసి బీసీల అభ్యున్నతికి బాటలు వేశానని చెప్పారు. నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరిగిందని, ప్రచారంలో ప్రజా స్పందన చూస్తుంటే చేవెళ్ల గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

**ఇద్దరు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఉన్నత వర్గాల వారు. మీరు బీసీ వర్గానికి చెందిన వారు? ఇది మీకు అనుకులమా? ప్రతికూలమా?**

చేవెళ్ల బరిలో నన్ను అభ్యర్థిగా ప్రకటించగానే అందరిలో చర్చ మొదలైంది. ఇద్దరు రెడ్డి అభ్యర్థుల మధ్య బీసీ వ్యక్తి పోరాడుతుండు అని. మా ముగ్గురి పనితనం ఇక్కడి ప్రజలకు బాగా తెలుసు. బీసీలకు అత్యధికంగా టిక్కెట్లు ఇచ్చింది ఒక్క బీఆర్ఎస్సే. కాంగ్రెస్, బీజేపీ బీసీలకు అసలు ప్రాధాన్యతే ఇవ్వలేదు. మా పార్టీ మాత్రమే ఆరుగురు బీసీలను బరిలో దింపింది. బీసీ బిడ్డగా 45ఏండ్లు పోరాడిన వ్యక్తి, 96 కులాలను ఏకం చేసి బీసీల అభ్యున్నతికి బాటలు వేసిన కాసానిని ఓడగొట్టుకుంటమా? అని నన్ను గెలిపించేందుకు బీసీలంతా ఏకమైండ్రు. నాకు పూర్తి విశ్వాసం ఉంది. అందరి సమన్వయంతో చేవెళ్ల గడ్డపై గులాబీ జెండాను ఎగరేసి కేసీఆర్‌కు గిఫ్ట్‌గా ఇవ్వబోతున్నం.



**బహుజన నాయకుడిగా మీకు పేరుంది.. ఈ ఎన్నికల్లో ఆ ప్రభావం ఉంటుందా?**

శ్రీకాకుళం నుంచి ఆదిలాబాద్ దాకా బస్సు యాత్ర చేసి 96 కులాల అధ్యక్షుడిగా బీసీలను ఏకం చేసిన. ఆ కులాల సమస్యలను వెలుగులోకి తెచ్చి పోరాడిన. బీసీల సమస్యలపై పార్లమెంట్‌లో గళమెత్తాలె అని కేసీఆర్ ఆలోచించి ఆరుగురికి టిక్కెట్లు ఇచ్చారు. ఆయన ఆలోచనలకు అనుగుణంగా పనిచేస్తా. నియోజకవర్గంలో జాతీయ రహదారుల అభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల నుంచి అర్బన్ ప్రాంతాలకు మెరుగైన రవాణా, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పార్లమెంట్‌లో కొట్లాడుతా.

**ప్రచారంలో ప్రజా స్పందన ఎలా ఉన్నది?**

నాలుగు నెలల కాంగ్రెస్ పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నది. బీఆర్ఎస్ పాలనే మళ్లీ కావాలని కోరుకుంటున్నరు. కాంగ్రెస్ పాలనతో సాగునీరందక లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయినయ్. కరెంట్ కోతలతో ప్రజలు అల్లాడుతున్నరు. కేసీఆర్ ఉన్నంత కాలం రెప్పపాటు కూడా కరెంట్ పోలేదు. గత ఎన్నికల్లో చేసిన పొరపాటును మళ్లీ చేయబోమని కార్మిక, కర్షకులు ముక్తకంఠంతో చెబుతున్నరు. నీటి ఎద్దడి రాకుండా కేసీఆర్ దూరదృష్టితో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరందించిన విషయాన్ని ప్రజలు గుర్తుచేసుకుంటున్నరు. ఇంటి పెద్దకొడుకులా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రంజాన్ తోఫాను కేసీఆర్ ఇచ్చారని, కాంగ్రెస్ పాలనలో అవేమీ లేవని ప్రజలే అంటున్నరు. దళితబంధు, బీసీ బంధు, రైతుబంధు రావడం లేదని ఆవేదన చెందుతున్నరు. కాంగ్రెస్ పాలనపై విరక్తిచెంది కేసీఆర్ సభలు, బస్సు యాత్రలు, మా ప్రచారానికి తండోపతండాలుగా తరలివస్తున్నరు. ప్రజా స్పందన చూస్తుంటే కచ్చితంగా బీఆర్ఎస్‌కు మళ్లీ పట్టం కట్టడం ఖాయంగా కనిపిస్తున్నది.

**ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ చెబుతోంది.. దీనిపై మీరేమంటారు?**

డిసెంబర్ 9 రాగానే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి మాట తప్పిండ్రు. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల కోసం ఆగస్టు 15 అని కొత్త పాట మొదలుపెట్టిండ్రు. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మలేమని రైతులే చెబుతున్నరు. నాలుగు నెలల పాలనలోనే దెబ్బ మీద దెబ్బ పడిందని రైతులు లబోదిబోమంటున్నరు.

**కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు బీఆర్ఎస్ నుంచి వెళ్లినవాళ్లే కదా?**

రంజిత్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఎంతటి అవకాశవాదులో నియోజకవర్గ ప్రజలకు పూర్తిగా తెలుసు. ఐదేండ్ల పాటు కేసీఆర్, కేటీఆర్‌లతో సన్నిహితంగా ఉండి సొంత ప్రయోజనాలు చూసుకున్నారే తప్ప నియోజకవర్గ ప్రజలకు వారు చేసిందేమీ లేదు. రంజిత్‌రెడ్డిని పార్టీ అభ్యర్థిగా ఖరారు చేసిన తర్వాతే బయటకు వెళ్లాడు. అధికారం ఉన్నంత కాలం ఎంజాయ్ చేశాడు. లీడర్ అనే వాడు గెలుపులో ఎంత సంతోషంగా ఉండాలో? ఓటమిలోనూ అంతే ఉండాలి. డబ్బు సంచులతో గెలువాలనుకుంటున్న ఆ ఇద్దరికి ప్రజలే గుణపాఠం చెప్తరు.

**ప్రతి ఎన్నికల్లో ఓటింగ్‌కు ఐటీ ఉద్యోగులు దూరముంటున్నారు కదా?**

ఈ సారి ఐటీ ఉద్యోగులు పోలింగ్ కేంద్రాలకు తప్పకుండా తరలివస్తారు. కేసీఆర్ పాలనలో ఐటీ రంగం గణనీయంగా వృద్ధి సాధించింది. నాలుగు నెలల్లో ఈ రంగంలో వచ్చిన మార్పును ఐటీ ఉద్యోగులు గమనించారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కచ్చితంగా బీఆర్ఎస్‌ను గెలిపించుకుంటామని చెబుతున్నారు. రంగారెడ్డి జిల్లాతో నాకు ప్రత్యేక అనుబంధముంది. హైటెక్‌సిటీ అభివృద్ధికి ఏం చేయాలో నాకు స్పష్టత ఉంది. అంతిమంగా పదేండ్లపాటు మేం చేసిన పనులు చూడండి. వచ్చే రోజుల్లో ఏం చేస్తామో కూడా చెబుతున్నాం. ఈ ఎన్నికల్లో సబ్బండవర్గాలు బీఆర్ఎస్ పక్షాన నిలబడుతాయన్న విశ్వాసం నాకుంది.

# కేసీఆర్ ఇంటిపై వాలిన కాకి నా ఇంటిపై వాలొద్దు

- నామాను కూటమిలో చేర్చుకునేది లేదు
- రాముడు బీజేపీకే కాదు.. మాకూ దేవుడే
- బీజేపీ గెలిస్తే రిజర్వేషన్లు అటకమీదికే
- ఎస్సీ, ఎస్టీలపై బీజేపీ సర్జికల్ స్ట్రైక్
- మోదీ గాడిద గుడ్డు కూడా ఇయ్యలే
- రిజర్వేషన్ల వల్లే సీతక్కకు మంత్రి పదవి
- జమ్మికుంట, రేగొండ సభలో రేవంత్‌రెడ్డి

కరీంనగర్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ)/జమ్మికుంట, జయశంకర్ భూపాలపల్లి, (నమస్తే తెలంగాణ)/ రేగొండ: దేశంలో సంకీర్ణ ప్రభుత్వం వస్తుందని, బీఆర్ఎస్‌కు 12 సీట్లు ఇస్తే నామా నాగేశ్వరరావును కేంద్రమంత్రిని చేస్తానని కేసీఆర్ అంటున్నారని, ఆయనను మాత్రం ఇండియా కూటమిలో చేరనిచ్చేది లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్ ఇంటిపై వాలిన కాకి వచ్చి తన ఇంటిపై వాలితే కాంగ్రెస్ కార్యకర్తలు కాల్చి చంపుతారని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట, జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండలో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ను ఓడించాలన్న కుట్ర జరుగుతున్నదని గ్రహించిన సీపీఐ, సీపీఎం, కోదండరాం తమ పార్టీకి మద్దతు ఇస్తున్నారని చెప్పారు. బీజేపీ నాయకులు దేవుడి పేరు చెప్పి బస్టాండ్లలో బిచ్చగాళ్ల మాదిరిగా ఓట్లు అడుక్కుంటున్నారని ఎద్దేవా చేశారు. రాముడు బీజేపీకి మాత్రమే కాదని, ప్రతి హిందువుకు దేవుడేనని పేర్కొన్నారు. రాముడి పేరుతో బీజేపీ రాజకీయ వ్యాపారం చేస్తున్నదన్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు తొలగిస్తుందని, దేశ మూలవాసులైన ఎస్సీ, ఎస్టీలపై సర్జికల్ స్ట్రైక్ చేస్తుందని ఆరోపించారు.

**గాడిద గుడ్డు కూడా ఇవ్వలేదు**

గాడిద గుడ్డున్న కటౌట్‌ను రేవంత్ చూపెడుతూ మోదీ ఈ దేశానికి గాడిద గుడ్డును కూడా ఇవ్వలేదని విమర్శించారు. సెమీఫైనల్‌గా భావించిన గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నాయకులు గుజరాత్‌కు పారిపోయారని, పార్లమెంట్ ఎన్నికల్లో సూరత్‌కు పారిపోయేలా తీర్పు ఇవ్వాలని కోరారు. 2014లో రాష్ట్ర విభజన జరిగినపుడు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదని విమర్శించారు. 70 ఏండ్లుగా కొనసాగుతున్న రిజర్వేషన్లను తొలగించేందుకు తమకు రెండింట మూడోవంతు మెజార్టీ కట్టబెట్టాలని అమిత్‌షాలాంటి నాయకులు కోరుతున్నారని పేర్కొన్నారు. తాను అదే విషయాన్ని రెండు మూడు సభల్లో, టీవీ చానళ్లలో మాట్లాడితే కేంద్ర హోంశాఖ తనకు నోటీసులు పంపిందని తెలిపారు.

**తెలంగాణ పౌరుషమా.. గుజరాత్ పెత్తనమా?**

కాంగ్రెస్ తెచ్చిన రిజర్వేషన్లతోనే ఆదివాసీ బిడ్డ సీతక్క మంత్రి, కడియం కావ్య డాక్టర్ అయ్యారని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు అమలవుతాయని, బీజేపీ వస్తే వాటికి మంగళం పాడుతుందని తెలిపారు. గుజరాత్ పెత్తందార్లు, ఢిల్లీ సుల్తాన్లు ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని తేల్చి చెప్పారు. సరిహద్దు సైన్యాన్ని తెచ్చినా వెనుకాడేది లేదని పేర్కొన్నారు. ఇది తెలంగాణ పౌరుషానికి, గుజరాత్ పెత్తనానికి మధ్య జరుగుతున్న పోటీ అని రేవంత్ అభివర్ణించారు. సభలో మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, కొండా సురేఖ, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, రాజేందర్‌రెడ్డి తదితరులున్నారు.

**శివయ్యపై ప్రమాణం చేసి చెప్తున్నా**

రైతు రుణమాఫీపై రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రామప్ప దేవాలయంలోని శివుడిపై ప్రమాణం చేసి చెప్తున్నానని, ఆగస్టు 15లోగా రైతు రుణమాఫీ చేసి తీరుతానని స్పష్టం చేశారు. లేదంటే ఈ ప్రభుత్వం ఉండి కూడా లాభం లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఈ విషయాన్ని ఇంటింటికీ వెళ్లి చెప్పాలని కోరారు. కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడిగా విద్యావంతుడైన వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే సత్యం, హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌బాబు, సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, సీపీఐ నాయకులు చాడ వెంకటరెడ్డి, సీపీఎం నాయకులు వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు..



జమ్మికుంట సభలో గుడ్డు ఆకారం కటౌట్‌ను పట్టుకొని మాట్లాడుతున్న సీఎం



సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు. చిత్రంలో బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు

# కాకి వాలొద్దని గద్దలనే ఎత్తుకుపోతున్నవ్

- బీఆర్ఎస్ నాయకులను ఎట్లా చేర్చుకున్నవ్
- సీఎం పదవిని దిగజారుస్తున్న రేవంత్‌రెడ్డి
- కాంగ్రెస్‌పై కోపంతో బీజేపీకి ఓటెయ్యొద్దు
- బీజేపీతో పొత్తు లేనందుకే కవిత అరెస్టు
- పంద్రాగస్టుకు రుణమాఫీ చేస్తే రాజీనామా
- మాజీ మంత్రి హరీశ్‌రావు మళ్లీ సవాల్

గజ్వేల్, ఏప్రిల్ 30: కేసీఆర్ ఇంటి మీద వాలిన కాకి మాఇంటి మీద వాలితే కార్యకర్తలే కాల్చేస్తారంటున్న రేవంత్‌రెడ్డి గద్దలను ఎత్తుకుపోయింది వాస్తవం కాదా ? మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ప్రశ్నించారు. ఫేక్‌లు, లీక్‌లతో పాటు తన వ్యవహారశైలితో సీఎం పదవిని రేవంత్‌రెడ్డి దిగజారుస్తున్నాడని, బీఆర్ఎస్ నుంచి రంజిత్‌రెడ్డి, సునీతమహేందర్‌రెడ్డి, కడియం కావ్య, శ్రీహరి, దానం నాగేందర్‌ను తీసుకున్న రేవంత్‌రెడ్డికి మాట్లాడే నైతికత లేదని విమర్శించారు. మంగళవారం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్, రాయపోల్, దౌల్తాబాద్ మండల కేంద్రాల్లో నిర్వహించిన రోడ్‌షోల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా తిట్లు తిట్టుడు, లేకుంటే దేవుని మీద ఒట్లు పెడుతూ డ్రామాలు ఆడుతున్నదని రేవంత్ కాదా అని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీల ఆశ చూపి దొడ్డిదారిన అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఓడగొట్టి బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌పై కోపంతో బీజేపీకి ఓటేసి ఆగం కావొద్దని ప్రజలకు హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు. ఇంటి పార్టీ బీఆర్ఎస్‌ను గెలిపించుకుంటేనే తెలంగాణ ప్రయోజనాలు పరిరక్షిస్తారని, ప్రజల పక్షాన గళం విప్పే అవకాశం ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల్లోనే కల్యాణలక్ష్మి చెక్కులు అటకెక్కాయని, తులం బంగారం కొండెక్కిందని ఎద్దేవా చేశారు.

**విభజన హామీలు పట్టని బీజేపీ**


జూన్ 2నాటికి తెలంగాణ ఏర్పాటై పదేండ్లు అవుతుందని, నేటికీ విభజన హామీలు నెరవేర్చలేదని తన్నీరు హరీశ్‌రావు అన్నారు. వాటిపై పార్లమెంట్‌లో పోరాడాలంటే బీఆర్ఎస్ ఎంపీలు గెలవాలని అన్నారు. ప్రజల కోసం కొత్త జిల్లాలను కేసీఆర్ ఏర్పాటు చేస్తే అవి తీసేస్తామంటున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని దించేయాలని పిలుపునిచ్చారు. బీజేపీతో పొత్తు పెట్టుకోకపోవడంతోనే కవితను జైల్లో పెట్టారని మండిపడ్డారు. ఫేక్ వీడియోలు, గ్లోబెల్స్ ప్రచారాన్ని నమ్మి మోసపోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈనెల 13న మీరు వేసే ఓటుతో గుంపు మేస్త్రీ గువ్వ పగలాలని, ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తే తాను రాజీనామాకు సిద్ధమని మరోసారి మాజీ మంత్రి హరీశ్‌రావు సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. ప్రచారంలో బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, నాయకులు రాధాకృష్ణశర్మ, కేశిరెడ్డి నర్సింహ్మారెడ్డి, మాదాసు శ్రీనివాస్, దేవీ రవీందర్, మర్యాక్ కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఓయూ ప్రతిష్ఠకు కాంగ్రెస్ భంగం

- విద్యార్థులను వెళ్లగొట్టే కుట్ర జరిగింది
- బీఆర్ఎస్ పార్టీ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్

హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): వంద సంవత్సరాల చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీ ప్రతిష్ఠకు కాంగ్రెస్ ప్రభుత్వం భంగం కలిగించే ప్రయత్నం చేస్తున్నదని బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓయూకు కరెంట్ ఇవ్వలేమని, నీళ్లు అందించలేమని, విద్యార్థులు వెంటనే హాస్టళ్లు ఖాళీ చేయాలని ప్రభుత్వం నోటీసులు ఇచ్చిందని తెలిపారు. యూనివర్సిటీ నుంచి బయటకు వెళ్లిపోయాలని యూనివర్సిటీ చీఫ్ వార్డెన్ విద్యార్థులకు నోటీసులు ఇలా ఇస్తారని ప్రశ్నించారు. అసలు కాంగ్రెస్ ప్రభుత్వానికి బొత్తిగా అవగాహన లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. వీసీ అనుమతి లేకుండా చీఫ్ వార్డెన్ విద్యార్థులకు నోటీసులు ఎలా ఇస్తారన్నారని, ఈ విషయంపై కేసీఆర్ స్పందించిన తర్వాతే ప్రభుత్వం స్పందించి, చీఫ్ వార్డెన్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసిందని తెలిపారు. ప్రభుత్వం కావాలనే యూనివర్సిటీ నుంచి విద్యార్థులను వెల్లగొట్టే కుట్రకు దిగిందని పేర్కొన్నారు. యూనివర్సిటీలో నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఉంటే సెలవులు ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. యూనివర్సిటీ విద్యార్థులంతా ఏకమై కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రను తిప్పికొట్టాలని ఎర్రోళ్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

## లోకం పోకడ




## ఎండా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| నల్లగొండ | 46.2°c | 33.1°c |
| ఆదిలాబాద్ | 44.8°c | 26.8°c |
| ఖమ్మం | 44.0°c | 26.0°c |
| నిజామాబాద్ | 43.8°c | 30.1°c |
| మెదక్ | 43.5°c | 23.5°c |
| రంగారెడ్డి | 43.2°c | 22.9°c |
| కరీంనగర్ | 43.0°c | 29.0°c |
| మహబూబ్‌నగర్ | 42.5°c | 29.4°c |
| హైదరాబాద్ | 42.0°c | 30.0°c |
| వరంగల్ | 42.0°c | 29.0°c |

## వందేండ్ల ఎండ రికార్డు బ్రేక్

- 1921-2024 వరకు ఈ ఏప్రిల్‌లోనే అత్యధికం
- పలుచోట్ల 44 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు
- మరో 5 రోజులూ తప్పని తీవ్రవేడిగాలుల ప్రభావం

హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): ఈ ఏడాది ఏప్రిల్ నెలలో మునుపెన్నడూ లేనంతగా రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 103 ఏండ్లలో ఎన్నడూలేని అత్యధిక ఉష్ణోగ్రతలు ఈసారే నమోదయ్యాయి. వాతావరణశాఖ అందించిన సమాచారం ప్రకారం 1921 తర్వాత 2024కు ముందు ఏ ఒక్క సంవత్సరంలోనూ 44 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కాలేదు. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే రాష్ట్రంలో పలుచోట్ల 44 డిగ్రీలు దాటడం విశేషం. రానున్న ఐదు రోజుల్లో దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వాతావరణం మరింత వేడెక్కనున్నదని ఐఎండీ హెచ్చరించింది. ఈ ఐదురోజుల్లో దేశంలోని తూర్పు, దక్షిణ భాగంలో తీవ్రమైన వేడి గాలులు వీస్తాయి. మే నెలలో గతంలో కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చని తెలుస్తున్నది. ఇప్పటికే రెండో దశ పోలింగ్‌పై ఎండల ప్రభావం పడినట్టు ఎన్నికల అధికారుల దృష్టికి వచ్చింది. మే నెలలో జరిగే మిగతా 5 దశల పోలింగ్‌పై కూడా ఎండల ప్రభావం ఉండవచ్చని వాతావరణ శాఖ భావిస్తున్నది. ఓటింగ్ శాతం తగ్గే అవకాశాలు లేకపోలేదని పేర్కొంటున్నారు.

**నిప్పులు కురిపిస్తున్న భానుడు**

రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరిగింది. ప్రచండ భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. మే 3 వరకు ఎండల తీవ్రత ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ మేరకు వివిధ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, హైదరాబాద్, మెదక్ జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. వడదెబ్బతో సోమవారం ఒక్కరోజే ఐదుగురు మృతి చెందారు.

**నాలుగు రాష్ట్రాలకు రెడ్ అలర్ట్**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: దేశవ్యాప్తంగా ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాలకు ఐఎండీ రెడ్ అలర్ట్‌ను జారీ చేసింది. రానున్న రెండు మూడు రోజుల్లో వడగాడ్పుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని హెచ్చరించింది. సాధ్యమైనంత వరకు ఇంటి వద్దే ఉండాలని, అవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని సూచించింది. మరోవైపు తెలంగాణ, కర్ణాటక, సిక్కిం రాష్ట్రాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు.

# సర్కారులో 'ఉస్మానియా' హైరానా!

- కేసీఆర్ ట్వీట్‌పై స్పందించిన రేవంత్‌రెడ్డి
- విద్యార్థి నేత నోటీసే ఫేక్ అంటున్న చీఫ్ వార్డెన్ శ్రీనివాస్
- బీఆర్ఎస్ నేత, విద్యార్థి నేతపై ఫిర్యాదు
- 24 గంటలు దాటినా చీఫ్ వార్డెన్‌కు అందని షోకాజ్ నోటీసు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ)/ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉస్మానియా హైరానా కొనసాగుతున్నది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఓయూలో నీటి కొరత, కరెంట్ కోత అంశాన్ని సోమవారం ఎక్స్ వేదికగా పోస్టు చేయడం, అది వైరల్‌గా మారడం.. డిప్యూటీ సీఎంసహా వివిధ శాఖల అధికారులు దిద్దుబాటు చర్యలకు దిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి కూడా దీనిపై స్పందించి 'ఫేక్'లో కాలేసినట్టుగా తెలుస్తున్నది. ప్రతి సంవత్సరం వర్సిటీ హాస్టళ్లు, మెస్‌లకు సెలవులు ప్రకటించడం సాధారణమేనని, నిరుడు కూడా కరెంటు కోతలు, నీటి కొరత ఉన్నట్టుగా పాత నోటీసును జత చేస్తూ ట్వీట్ చేశారు. దీనిపై ఓయూ విద్యార్థి నాయకుడు నాగేందర్‌రావు కొడాటి ఎక్స్ వేదికగా స్పందించాడు. అది ఫేక్ నోటీస్ అంటూ మండిపడ్డారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి, ఫేక్ నోటీసు ఎలా పోస్టు చేస్తారంటూ అసలు నోటీసు ఇది అంటూ పాత నోటీసును జత చేశారు. సీఎం పోస్టు చేసిన నోటీసులో ఈ ఏడాది మాదిరిగానే కరెంటు కోతలు, నీటి కొరత ఉన్నదని అందులో పేర్కొనగా... నాగేందర్‌రావు పోస్టు చేసిన నోటీసులో కేవలం ఒక నెల సమ్మర్ సెలవులు ఇస్తున్నట్టుగానే ఉన్నది. ఈ ట్వీట్ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ అయింది.

**ముందుగానే నోటీసుల సేకరణ ఎందుకు?**

వర్సిటీ చీఫ్ వార్డెన్ డాక్టర్ కొర్రెముల శ్రీనివాస్ సోమవారం జారీచేసిన నోటీసు వివాదాస్పదంగా మారడంతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నుంచి విద్యుత్‌శాఖ, జలమండలి అధికారులు వేర్వేరు పత్రికా ప్రకటనల ద్వారా కరెంటు, నీటి సరఫరా బాగానే ఉందంటూ సమర్థించుకున్నారు. ఈ నేపథ్యంలో గతంలో నోటీసులు ఎలా ఉన్నాయని పరిశీలించేందుకు 'నమస్తే తెలంగాణ' ప్రయత్నించగా.. వాటన్నింటినీ రెండు రోజుల కిందటే చీఫ్ వార్డెన్ తీసుకెళ్లారని, తమ దగ్గర వాటి తాలూకు కాపీలు కూడా లేవని సంబంధిత కార్యాలయ సిబ్బంది చెప్పడం అనుమానాలకు తావిస్తున్నది. 'నమస్తే తెలంగాణ' చీఫ్ వార్డెన్‌ను సంప్రదించగా... సీఎం రేవంత్‌రెడ్డి పోస్టు చేసిన పాత నోటీసు కాపీని మాత్రమే పంపారు. అసలు ప్రతి (ఒరిజినల్) కాపీని పంపాల్సిందిగా కోరితే... ఒరిజినల్ కాపీ గతంలో నోటీసు బోర్డుపై అంటించారని, తమ దగ్గర జిరాక్స్ ప్రతులే ఉన్నాయంటూ సమాధానమివ్వడం గమనార్హం.

**సాయంత్రానికి ఓయూ పీఎస్‌లో ఫిర్యాదు**

సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ట్వీట్‌పై విద్యార్థి నేత నాగేందర్‌రావు స్పందించి.. అది ఫేక్ నోటీసు అని ట్వీట్ చేయడంపై గంటల తరబడి సోషల్ మీడియాలో చర్చ జరిగింది. సాయంత్రం మాత్రం చీఫ్ వార్డెన్ శ్రీనివాస్ ఓయూ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి బీఆర్ఎస్ నేత, ఉస్మానియా పూర్వ విద్యార్థి మన్నె క్రిశాంక్, విద్యార్థి నాయకుడు నాగేందర్‌రావుపై ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియాలో ఫేక్ నోటీసును వైరల్ చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో అసలు సీఎం రేవంత్‌రెడ్డి పోస్టు చేసిన నోటీసు ఫేకా? చీఫ్ వార్డెన్ ఫిర్యాదు చేసినట్టు నాగేందర్‌రావు పోస్టు చేసిన నోటీసు ఫేకా? అనే దానిపై చర్చ మొదలైంది. కాగా, రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ సోమవారం చీఫ్ వార్డెన్ శ్రీనివాస్‌కు జారీ చేసిన షోకాజ్ నోటీసు మంగళవారం రాత్రి వరకు అందకపోవడం విడ్డూరం. పైగా 'నిర్ణీత సమయంలో సంజాయిషీ ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటాం' అని నోటీసులో రిజిస్ట్రార్ పేర్కొనగా... 24 గంటలు గడిచినప్పటికీ నోటీసు అందకపోవడం వెనక మర్మమేమిటనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.





# కేసీఆర్ దెబ్బకు దిగొచ్చిన సర్కారు

- ఓయూ హాస్టళ్లు తెరిచే ఉంటాయని ప్రకటన
- విద్యార్థుల సంఖ్య ఆధారంగా మెస్‌లను ప్రారంభిస్తామని చీఫ్ వార్డెన్ మెలిక

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ)/ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దెబ్బకు కాంగ్రెస్ సర్కారు దిగొచ్చింది. కేసీఆర్ ట్వీట్‌చేసిన 24 గంటల్లోపే వర్సిటీ హాస్టళ్లు తెరిచే ఉంచుతామని ప్రకటించింది. ఈ మేరకు ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు వేసవి సెలవులను ఉపయోగించుకుంటామని, హాస్టళ్లను మూసివేయ వద్దని ఇటీవల విద్యార్థుల బృందం నుంచి తమకు విజ్ఞాపన వచ్చిందని, వారి వినతి మేరకు వేసవి సెలవుల సమయంలోనూ హాస్టళ్లను తెరిచి ఉంచాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ఈ నిర్ణయం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని రిజిస్ట్రార్ తన ఉత్తర్వులో వెల్లడించారు. మరి.. ఇదే నిజమైతే, కొన్నిరోజుల కిందట విద్యార్థుల బృందం విజ్ఞప్తి చేస్తే చీఫ్ వార్డెన్ నోటీసు జారీ చేసే ముందు దానిని ఎందుకు పరిశీలించలేదనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పైగా విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారనేది ఇప్పటికిప్పుడు చోటు చేసుకున్న పరిణామమేమీ కాదు. అంటే కేసీఆర్ దెబ్బకు సర్కారు దిగొచ్చింది.. అని పలువురు విద్యార్థులు తెలిపారు. వేసవి సెలవుల్లోనూ వర్సిటీ హాస్టళ్లను తెరిచే ఉంచుతామని ప్రకటించిన రిజిస్ట్రార్ మెస్‌ల విషయంలో స్పష్టత ఇవ్వలేదు. దీనిపై చీఫ్ వార్డెన్‌ను సంప్రదించగా.. సెలవుల్లో హాస్టళ్లలో ఉండే విద్యార్థుల సంఖ్య ఆధారంగా మెస్‌లను ప్రారంభిస్తామని తెలిపారు.